సంక్షిప్త వార్తలు

ముర్రికి కాల్వను నిర్మిస్తాం


పరిసరాలు పరిశీలిస్తున్న చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులోని వెంకటేశ్వర కాలనీలో ముర్రికి కాలువ నిర్మాణ పనులు త్వరలో చేస్తామని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ చెప్పారు. ఆయన శనివారం పలువురు నాయకులతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీని అనుకొని ఉన్న బస్టాండ్ కుంట పక్క నుంచి త్వరలో ముర్రికి కాల్వ నిర్మాణ పనులకు రూ. 35 లక్షలు కేటాయించినట్లు తెలిపారు.

వర్గీకరణపై ప్రభుత్వ వైఖరి ప్రకటించాలి


మాట్లాడుతున్న మాసాయిపేట యాదగిరి

చేగుంట(తూప్రాన్): ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మాసాయిపేట యాదగిరి అన్నారు. శనివారం చేగుంటలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై వర్గీకరణ కోసం ఒత్తిడి తీసుకురావడానికి హైదరాబాద్‌లో ఫిబ్రవరిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ ఆధ్వర్యంలో వేయి గొంతులు – లక్ష డప్పుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రామస్వామి, మురళి, సుధాకర్, ఆగం, యాదగిరి, రాజ్‌కుమార్, సాయిబాబా, బాబుచ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని అల్లిపూర్ గ్రామంలో శనివారం విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం నర్సాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లిపూర్ గ్రామానికి చెందిన దుర్గప్రసాద్, నాగరాజు మృతి చెందారు. వీరి అంత్యక్రియలు శనివారం అల్లిపూర్ గ్రామంలో నిర్వహించారు. మృతదేహాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి సందర్శించి నివాళ్లులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థికసాయం చేశారు. జెడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, నాయకులు రఘుగౌడ్, రాజు, శ్రీనివాస్, యాదయ్య, తదితరులు ఉన్నారు.

ధర్మారంలో..


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ధర్మారం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నవీన్, ప్రభాకర్‌లకు చెందిన నివాసగృహాలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసహాయం అందజేశారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందిస్తున్న రాజిరెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. శనివారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో నర్సాపూర్, హత్నూర మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.12లక్షల 68వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేశారు. ఆయన వెంట ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, పలువురు కాంగ్రెస్ నాయకులు మల్లేశ్, సుధీర్‌గౌడ్, సాగర్ తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం పేద ప్రజల కోసం అందిస్తున్న సహాయం సద్వినియోగం చేసుకోవాలని మాజీ జెడ్పీటీసీ మహేష్‌గుప్తా అన్నారు. పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండల్, పోచగౌడ్, అశోక్,త్రినేష్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

– కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్


చెక్కులను అందిస్తున్న రమేశ్, నాయకులు

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని నిరుపేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్ తెలిపారు. శనివారం టేక్మాల్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఇందులో పీఏసీఎస్ డైరెక్టర్ పాపయ్య తదితరులు ఉన్నారు.

నార్సింగి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ మృతి



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో ఆకస్మాత్తుగా పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు హైదారాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. శనివారం రాత్రి మృతి చెందినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడుగా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ మృతిపై కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం మధ్యాహ్నం నార్సింగిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొప్పులపల్లిలో..

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామానికి చెందిన బొప్పిడి జయరాంరెడ్డి శుక్రవారం రాత్రి అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందాడు. శనివారం తన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు.

రోడ్డంతా కంకర.. నడిచేదెలా?

- ఏళ్ల తరబడిగా శిథిలమైన రహదారి
- నిర్లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు


కంకర తేలిన నిజాంపేట, నస్కల్ రోడ్డు

రామాయంపేట/నిజాంపేట(మెదక్): రెండు జిల్లాలకు చెందిన గ్రామాలను కలుపుతూ ఉన్న ఈ రోడ్డు మరమ్మతుకు కంట్రాక్టర్ రెండేళ్ల క్రితం కంకర పరిచి వదిలేశాడు. ఈ విషయమై జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంతమాత్రం పట్టించుకోడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో ఇబ్బందులపాలవుతున్న ప్రజలు విధిలేని పరిస్థితుల్లో నిరసన దీక్ష ప్రారంభించారు. వివరాల్లోకి వెలితే... నిజాంపేట మండల కేంద్రం నుంచి కామారెడ్డి జిల్లాకు వెళ్లడానికి ప్రస్తుతం ఉన్న తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. కేవలం మెదక్ జిల్లా పరిధిలోనే రోడ్డు పూర్తిగా దెబ్బతినగా, కామారెడ్డి జిల్లా పరిధిలో రోడ్డు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశారు. నిజాంపేట నుంచి నస్కల్, నందగోకుల్ చల్మెడ గ్రామాల మధ్య 18 కిలో మీటర్ల మేర తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీని మరమ్మతుల నిమిత్తం మూడేళ్ల క్రితం బీఆర్ఎస్ హయంలో రూ. 12 కోట్లు మంజూరు కాగా సంబంధిత కంట్రాక్టర్ రోడ్డుపై కంకర వేసి వదిలేశాడు. ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. రోడ్డుపై పరుచుకున్న కంకరతో ప్రయాణికులు ఇబ్బందులపాలవుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న క్రమంలో రాత్రి వేళలో తాము తరచూ ప్రమాదాల బారీన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు.


నిజాంపేట వద్ద నిరసన దీక్షలు చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు

కామారెడ్డి జిల్లా కేంద్రానికి, ఆ జిల్లా పరిధిలో ఉన్న గ్రామాలకు వెళ్లడానికి ఇదే దగ్గరి మార్గం కావడంతో చాలా మంది ఈదారిలోనే ప్రయాణిస్తారు.

మరమ్మతుల కోసం నిరసన దీక్షలు ప్రారంభం

రోడ్డు మరమ్మతుల విషయమై ఎవరూ పట్టించుకోనందుకు నిరసనగా శనివారం పలు గ్రామాల ప్రజలు నిజాంపేటలోని నస్కల్ దారిలో నిరసన దీక్షలు ప్రారంభించారు. రెండేళ్లుగా కంకర పరుచుకున్న రోడ్డుపై వెళ్లడం వల్ల తమ వాహనాలు సైతం పంక్చర్ అవుతున్నాయని వారు వాపోయారు. రోడ్డు పనులు ప్రారంభమయ్యే వరకు దీక్షలు విరమించమని స్పష్టం చేశారు. ఈ దీక్షలకు పలు పార్టీల నాయకులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు తమ మద్దతు ప్రకటించారు.

త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తాం



నిజాంపేట, చల్మెడ గ్రామాల మధ్య రోడ్డుపై కంకర పరుచుకున్న విషయమై తమ దృష్టికి వచ్చింది. ఈరోడ్డు మరమ్మతుల పనులు త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం.

– సర్దార్ సింగ్, రోడ్డు, భవనాల శాఖ ఈఈ

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. శనివారం మండల కేంద్రం టేక్మాల్‌లో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా రైతుకు మద్దతుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ... రైతురుణ మాఫీ, రైతుబంధు, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, రైతుబీమా, ఉచిత కరెంట్ వంటి హామీలను అమలు చేయడంలేదని మండిపడ్డారు. సీఎం, మంత్రులు ఇళ్లలో దాక్కున్నారని ప్రజల్లోకి రాలేని దుస్థితి నెలకొన్నదన్నారు. 6 గ్యారంటీలంటూ కళ్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉండి వారి సమస్యపై కొట్లాడేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ టేక్మాల్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్, శివకుమార్, వినోద్, నర్సింలు, శివకుమార్, వీరారెడ్డి, నాయకులు యశ్వంత్‌రెడ్డి, భాస్కర్, సలీమ్, రవి, సిద్ధయ్య, సుధాకర్, శ్రీనివాస్, మహేందర్, రజాక్, రాజుగౌడ్, గోవిందచారి, షాబొద్దీన్, బన్నయ్య, వెంకట్‌గౌడ్, బాల్‌రాజ్, మల్లేశం, బసంత్‌రావు, సంగయ్య, రమేశ్‌నాయక్, చంద్రశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


టేక్మాల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

మల్లికార్జునస్వామి జాతర ప్రారంభం


గంగకు వెళ్తున్న భక్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో వెలిసిన భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ధర్మకర్త వాల్దస్ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గణపతి పూజ, అభిషేకం, అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఒగ్గు కళాకారుల బృందంతో ఉత్సవాల్లో మొదటి రోజు గంగ జ్యోతి వెలిగించేందుకు ఊరేగింపుగా వెళ్లారు. ఆదివారం సామూహిక ఘటాభిషేకం, గండ దీపాలు, భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణం, అగ్ని గుండాలు, సాయంత్రం బండ్లు, బోనాల ఊరేగించారు. సోమవారం రుద్రయాగం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తారు. మంగళవారం దేవత పూజ, రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. జాతర సందర్భంగా ప్రతిరోజు సమయానుకూలంగా భక్తి భజనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఒగ్గు కళాకారుల ప్రదర్శన, కోలాటం, నిరంతరం అన్నదానం ఉంటుందన్నారు. ఈ ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.

పీపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం


కొడిపల్లిలో జ్యోతిప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రంజిత్


కొల్చారం(నర్సాపూర్): పైతరలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రవితేజరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను శనివారం రాత్రి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం, శరీరదృఢత్వం ఏర్పడుతుందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని చెప్పారు. కౌడిపల్లి బ్యాడ్మింటన్ యూత్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహిస్తుండగా కౌడిపల్లి, చిలిప్‌చెడ్, వెల్దుర్తి మండలాలకు చెందిన 14 జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు వంశీ, విజయ్ తెలిపారు. మొదటి బహుమతి రూ. 3,500, ద్వితీయ బహుమతి రూ. 2,500 ప్రైజ్‌మనీ అని మాజీ సర్పంచ్ కాంతపురుషోత్తం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు, క్రీడాకారులు కృష్ణ, భూషణం, సత్యం, దుర్గయ్య, ఆంజనేయులు, ఆర్ఎంపీ సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్చారంలో..

కొల్చారం(నర్సాపూర్): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు సెలవు రావడంతో గ్రామాల్లోకి చేరుకున్న విద్యార్థులు, యువకులు క్రికెట్ ఆడేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. శనివారం పలు గ్రామాల్లో క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. పైతర గ్రామంలో పీపీఎల్ సీజన్-2, సంగాయిపేటలో ఎస్పీఎల్ సీజన్ -5 క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పైతరలో జరుగుతున్న జరిగే క్రికెట్ పోటీలకు బీఆర్ఎస్ యువత నాయకుడు రవితేజ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యువకుడు సమరసింహారెడ్డి, గ్రామ మాజీ ఎంపీటీసీ ఆదాం, ఎల్లేశం విజేతలకు అవసరమైన ప్రైజ్ మనీ, బహుమతులకు సహకారం అందిస్తున్నారు.

దళితులకు కేటాయించాలి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి దళితులకు కేటాయించాలని మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య కోరారు. శనివారం ఈ సందర్భంగా నార్సింగిలో ఆయన మాట్లాడుతూ.. నియోజవర్గంలోనే అతి పెద్ద గ్రామపంచాయతీగా గుర్తింపు పొందిన నార్సింగి స్థానిక సంస్థల ఎన్నికలు మొదలైనప్పటి నుంచి ఇప్పటికీ కూడా ఎస్సీలకు రిజర్వేడ్ కాలేదన్నారు.

రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంపేట(మెదక్): మండలంలోని నస్కల్ రోడ్డు నిర్మాణ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్నాయని మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు అమరసేనారెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నస్కల్ రోడ్డు నిర్మాణ పనులను బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ మంత్రి కేటీఆర్ బంధువు కావడంతో రోడ్డు పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నసీరొద్దీన్, లింగంగౌడ్, వెంకటేశం, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని భావితరాలకు నేర్పించాలి

- ఎమ్మెల్యే సునీతారెడ్డి


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్: మన సంస్కృతిని భావితరాలకు నేర్పించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శనివారం పట్టణానికి చెందిన ప్రసాద్, జ్ఞానేశ్వర్, నాగరాజుగౌడ్ తదితరులు పట్టణంలోని 10, 11 వార్డులకు చెందిన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతుల అందించే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు. మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు తెలియ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలిచిన విజేతలకు ఎమ్మెల్యేతో పాటు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయామొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు ప్రసాద్, సత్యంగౌడ్, నర్సింలు, /జ్ఞానేశ్వర్, నాగరాజుగౌడ్, షేక్ హుస్సేన్, ఆంజనేయులుగౌడ్, వెంకటేష్‌గుప్తా, కిషోర్, శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రోడ్ల పనులకు టెండర్లు పూర్తి

గత ప్రభుత్వ హయాంలో మూడు రోడ్ల ఏర్పాటు కోసం రూ.రెండు కోట్ల 73 లక్షలు మంజూరయ్యాయి. ఆయా రోడ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తి అయ్యాయని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. శివ్వంపేట మండలంలోని అల్లీపూర్ పీడబ్ల్యూడీ రోడ్డు అల్లీపూర్ తండా వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో రూ.70లక్షలు మంజూరయ్యాయన్నారు. జెడ్పీ రోడ్డు నుంచి తార్య తండా వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేసేందుకు రూ.ఒక కోటి 54లక్షలు, చండి గంగాయిపల్లి అప్రోచ్ రోడ్డు నుంచి జగ్యాతండా వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేసేందుకు రూ.49లక్షలు మంజూరయ్యాయన్నారు. ఆయా పనులకు టెండర్లు పూర్తి అయ్యాయని, పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని వివరించారు.



బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

పెద్దశంకరంపేట(మెదక్): సంక్రాంతి సంబురాల్లో భాగంగా సరస్వతి శిశుమందిరంలో ముగ్గుల పోటీలతో పాటు కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, పాఠశాల అధ్యక్షుడు గంగాధర్, రాఘవులు, హెచ్‌ఎం వీరప్పలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రబంధకారిని సభ్యులు క్రాంతీలాల్, పున్నయ్య, జైహింద్‌రెడ్డి, సీతారం, సతీష్‌గౌడ్ తదితరులున్నారు.

పాఠశాలలో సంక్రాంతి సంబరాలు


మనోహరాబాద్‌లో..


వెల్దుర్తిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని భాష్యం విద్యామందిర్‌లో శనివారం ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు.

దండుపల్లి పాఠశాలలో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని దండుపల్లి బాల్యం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు.

పల్లెవెలుగులోనూ చార్జీల మోత

- ప్రయాణికులకు ఆర్టీసీ షాక్



కౌడిపల్లి నుంచి నర్సాపూర్‌కు టికెట్

చిన్నశంకరంపేట(మెదక్): సంక్రాంతి పండుగపూట ప్రయాణికులకు ఆర్టీసీ షాక్ ఇచ్చింది. స్పెషల్ బస్సుల పేరుతో బస్సు టికెట్ రేట్లు అమాంతం పెంచడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ధరకు 30 శాతం పెంచి టికెట్లు జారీ చేస్తున్నారు. మెదక్ నుంచి చిన్నశంకరంపేటకు డిలక్స్ బస్సు రేట్ రూ.40 ఉండగా, రూ.70 టికెట్ ధరను పెంచగా, గవ్వలపల్లి నుంచి చేగుంటకు రూ.60 వసూలు చేస్తున్నారు. తూప్రాన్‌కు రూ.100 ఉండగా రూ. 150, సుచిత్ర వరకు రూ.150 ఉండగా, రూ.220కు పెంచారు. ముఖ్యంగా ఫ్రీ బస్ ప్రయాణం ఉంటుందని భావించి వచ్చిన మహిళలకు ఇబ్బందులు తప్పడంలేదు. చేగుంట–మెదక్ మధ్యన రోజు నడిచే పల్లెవెలుగు బస్సులకు సైతం స్పెషల్ బస్సులు అని చెప్పి, డబ్బు చార్జీ చేస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు.

ఆర్టీసీ పండుగ బాదుడు

కౌడిపల్లి(నర్సాపూర్): ఆర్టీసీ పండుగ బాదుడు ప్రారంభించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ బస్సులు అంటు వసూలు చేస్తుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. నర్సాపూర్ నుంచి కౌడిపల్లికి రూ. 30 టికెట్ ధర ఉండగా, శనివారం సంక్రాంతి స్పెషల్ అంటూ స్టిక్కర్లు వేసి రూ.40 వసూలు చేస్తున్నారని వాపోయారు.

క్లుప్తంగా

◆ **రేపటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్**

రేగోడ్(మెదక్): మండలంలోని టి.లింగంపల్లి గ్రామంలో సోమవారం నుంచి మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు శ్రీనివాస్ శనివారం తెలిపారు. మాజీ సర్పంచ్ బగిలి హన్మప్ప స్మారకార్థం టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆదివారం సాయంత్రం వరకు జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని, ఆదే రోజు సాయంత్రం డ్రా తీస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు 80080 95889 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

◆ **వైభవంగా గురు ఆరాధనోత్సవాలు**

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో జీవసమాధి అయిన రాజాయోగి నారాయణదాస్ గురు 42వ ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం చిన్నశంకరంపేటలో నిర్వహించిన ఆలయ వార్షికోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గురు పూజోత్సవం, ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంత పద్మనాభస్వామి ఆశ్రమ నిర్వాహకుడు జ్ఞానేశ్వర్ మహారాజ్ భక్తులను ఆశీర్వదించారు.

◆ **మిల్లి కౌన్సిల్ నూతన కమిటీ ఎన్నిక**

మెదక్ మున్సిపాలిటీ: మిల్లి కౌన్సిల్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు మహ్మద్ ఓమర్‌ఖాన్ శనివారం తెలిపారు. మెదక్ పట్టణంలోని ఆజంపురాలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు మిల్లి కౌన్సిల్ మెదక్ నూతన కమిటీనిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సూఫీ, సంయుక్త కార్యదర్శిగా జర్నలిస్ట్ మహ్మద్ రియాజుద్దీన్, ఉపాధ్యక్షుడిగా ముజీబ్, కోశాధికారిగా మౌలానా అబేద్ అలీలను ఎన్నుకున్నారు.

◆ **పీఆర్టీయూ జిల్లా శాఖకు ముగ్గురు ఉపాధ్యాయులు**

వెల్దుర్తి(తూప్రాన్): పీఆర్టీయూ టీఎస్ జిల్లా శాఖకు మాసాయిపేట మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయుల్ని నియమిస్తూ జిల్లా శాఖ ఉత్వర్వులు జారీచేసినట్లు మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ అన్నారు. మండలం నుంచి జిల్లా మహిళా ప్రతినిధులుగా ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, రమాదేవి, రజితలను నియమించడంపై వారిని అభినందించారు.

◆ **నిత్యావసర సరుకులు అందజేత**

శివ్వంపేట(నర్సాపూర్): అపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా అన్నారు. శనివారం మండలంలోని లింగోజిగూడ తండాకు చెందిన చందర్ నాయక్, అమ్రూ నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. అల్లీపూర్‌లో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి, రూ.10 వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు స్వామి, శివకుమార్, నరేందర్, శంకర్‌గౌడ్ యాదయ్య ఉన్నారు.

◆ **మక్కరాజీపేటలో వాలీబాల్ పోటీలు**

చేగుంట(తూప్రాన్): సంక్రాంతి సందర్భంగా మండలంలోని మక్కరాజీపేట గ్రామంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మినాకర్ తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించే ఈ పోటీలకు ఆరు వందల ఎంట్రీ ఫీజు ఉంటుందని ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.6వేల నగదు అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8501022432 నంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు.

◆ **కార్మికులకు బకాయిలు చెల్లించాలి**

నర్సాపూర్: మిషన్ భగీరథ పథకం నిర్వహణ పనులు చేపట్టే బీఆర్‌సీ సంస్థలో పనిచేసే కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌సీ సంస్థలో పని చేస్తున్న కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థలో 9 ఏళ్లుగా పని చేస్తున్నా.. కార్మిక చట్టాల మేరకు వేతనాలు అందడం లేదని, నెల నెల వేతనాలు అందనందున కార్మికులు ఆర్థికపరమైన ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.